ప్రకృతి

పి. లీలావతి

మద్రాసు మెయిలు విజయవాడ స్టేషన్‌లో ఆగింది. భోరున వర్షం కురుస్తోంది. అయినా జనం గొడుగులు వేసుకుని తడుస్తూ పరుగెడుతున్నారు. విద్యార్థులు, ప్రయాణికులు, పదార్థాలు అమ్మేవాళ్లు ఆయిల్ పేపర్లు నెత్తిమీద వేసుకుని సగం తడుస్తూ ట్రేలు పట్టుకుని అరచి అమ్ముతున్నారు.

స్టేషను రోజూలా కోలాహలంగా— ప్రసవవేదన తీరి బిడ్డను కనినతర్వాత ఇంట్లో జరిగే హడావుడిలా వుంది.

రామశర్మగారు ఫస్ట్‌క్లాసు రిజర్వ్ కంపార్ట్‌మెంట్ తలుపు తీసుకుని గుమ్మం దగ్గరకు వచ్చి నిల్చున్నాడు. వర్షం జల్లు బాగా కొడుతోంది. రామశర్మగారు ఖరీదైన రెయిన్‌కోటుమీద వర్షపు బిందువులు ముత్యాల్లా క్రిందికి జారుతున్నాయి నెత్తిమీదవున్న హాటు బాగా ముఖంమీదికి లాక్కుని ఆయన పేపర్లమ్మే కుర్రాడిని పిలిచి ఒక ఇంగ్లీషుపత్రిక తీసుకుని బరువైన పర్సును జాగ్రత్తగాతీసి డబ్బులిచ్చి లోపలికివెళ్లి కూర్చున్నారు. జేబులో నుండి బంగారపు సిగరెట్‌కేసు తీసి ఓ సిగరెట్ వెల్గించి బయటకు చూశారు.

గ్లాసు విండోనుండి క్రిందికి జారుతున్న నీరు బయటదృశ్యాలను ఒకనిజాన్ని కప్పివేసే అబద్ధంలా కలగాపులగం చేస్తున్నాయి.

నాలుగు రోజులైంది ఇలా గాలివానా ప్రారంభమై మానవుని అంచనాలను తల్లక్రిందులు చేస్తూ — నిప్పులు కురిసే ఈ వేసంగిలో కుండపోతగా ఈ వర్షమేమిటి? రోళ్లు బద్దలు కొట్టాల్సిన సూర్యుని ప్రతాపం వరుణుని ప్రతాపం ముందుతెర మరుగైనట్లు ఈ మేఘమాలికలు విజృంభించి విలయతాండవం చేస్తూ రైలు వంతెనలనూ, నది ఆనకట్టలనూ బద్దలు కొడుతున్నాయేమిటి? వర్షం—వర్షం—ఒకటేవర్షం —మన్నూ మిన్నూ యేకంచేస్తోన్న వర్షం —వరుగులెత్తే మనుష్యులను తరిమిగొడుతూన్న వర్షం — ఇదేనా కలికాలం? ఇదేనా విపరీతం?

రామశర్మగారు ఆలోచనలనుండి తేరుకుని పేపరు హెడ్డింగులు చూశారు. ఆ ఇంగ్లీషు పేపరు హెడ్డింగులకు తెలుగు తాత్పర్యం యిది.

‘హైదరాబాదులో తిరిగి కాల్పులు’

‘ఢిల్లీ రాజకీయాల్లో మరో ప్రతిష్ఠంభన.’

‘రాజస్థాన్‌లో ఒక కుటుంబం ఆకలి బాధకు తాళలేక ఆత్మహత్య గావించుకున్న వుదంతం—’

‘మంత్రిగారి యింటిముందు నిరుద్యోగుల బైఠాయింపు.’

భళా! దేశం — ప్రజయావత్తూ అంతర్గతంగా ఏనాడో తుఫాన్‌లో చిక్కుకుంది. మనిషికీ—సమాజానికీ చక్కటి బంధమేర్పరిచే ఈ విద్యుత్ వంతెనలు అపసవ్య విధానాలకు అరాజకీయ తుఫాను

లకు కూలిపోతున్నాయి. అయితే అతివృష్టి కాకపోతే అనావృష్టిలా తయారైనాయి పరిస్థితులు. ప్రతి ఒకడూ క్రొత్తగా నేర్చుకొన్న దేమిటంటే 'విమర్శించడం'. దేశ సమస్యలు రైలుపెట్టెలో-బార్బర్ షాపుల్లో — కాఫీ హోటళ్లలో చర్చనీయాంశాలై పోయాయి. ఇది అన్యాయం—ఇది అక్రమం అని ఆక్రోశించే కాలక్షేపపు విమర్శనాగ్రేసరులు ముందు తాము ఏపాటి దేశానికి వుపయోగపడుతున్నాము? అని ఆలోచించలేక పోతున్నారు. కాబట్టే దేశప్రతిష్ట ఇలా బజార్లో పడుతోంది-ప్రకృతి సహించలేనట్లు విపరీపు పోకడలు పోతోంది-లేకపోతే మే నెలలో తుఫానేమిటి? మగవాడు మాతృమూర్తి అయినట్లు!!

రామశర్మగారు విసుగ్గా పేపరు ప్రక్కన పడవేశారు. ఆయన కెందుకో ఆ సమయంలో మహాకవి 'విలియం వర్డ్స్‌వర్తు' గుర్తొచ్చాడు. ప్రకృతిని ప్రాణ సమానంగా ఆరాధించిన ఆ మహాకవి ఈలాటి ప్రకృతి వికృతి చేష్టలు చూస్తే ఏమంటాడో! ఆ! ఆయనే చెప్పాడు. ఒకసారి 'లెట్ నేచర్ బియువర్ టీచర్' అని—ప్రకృతి జనతగురువు. జనావళి దారితప్పితే గురువు తనకోపంతో మందలిస్తాడు. శాసిస్తాడు. నిజమే!— అదే యిప్పుడు ప్రకృతి మానవాళిని మందలిస్తోంది.

'ఏమన్నా కావాలాసార్?' పలుకరించాడు కాకీ దుస్తుల్లోవున్న ఫస్టుక్లాసు అటెండరు.

'ఏమీ అవసరంలేదు. బండి ఎప్పుడు స్టార్ట్ అవుతుంది?' అడిగారు.

'ఎస్ట...ఇంకొన్ని నిమిషాల్లో అవుతుందిసార్! ఎక్కడ-ఇవాళ అన్నిబండ్లు కాన్సిల్ అయిపోయాయి హైదరాబాదు రూటులో రెండు బ్రిడ్జిలు; ఒక మైలున్నర ట్రాక్ కొట్టుకుపోయింది సార్!'

రామశర్మగారి గుండె జల్లుమంది. ఆయనకు వెంటనే భార్య సత్యవతి గుర్తొచ్చింది. తను ఆలస్యంచేస్తే ఆవిడేమనుకొంటుందో!

'అయితే ఈ బండికేదైనా అవాంతరం రాదుగద!' ఆత్రుతతో అడిగారు.

'ఏమోసార్! బహుశా రాకపోవచ్చు. ఈ బండిని ఎలాగైనా మద్రాసు చేర్చేయాలని ఆఫీసర్లు అనుకుంటున్నారు' అన్నాడతను.

రామశర్మగారిగుండె కొంచెం కుదుటబడింది.

'థాంక్స్! మద్రాసు చెంతచాలు ఎలాగైనా!!' అన్నారు.

'భోజనం పంపమంటారా సార! మళ్లీ మద్రాసు చేరేవరకూ మంచి భోజనం దొరకదు.' అడిగాడు అటెండరు.

'నో! ఆకలిగాలేదు' అన్నారు రామశర్మ.

'మీ యిష్టం' అని తను వెళ్లిపోయాడు.

రామశర్మగారు సత్యవతమ్మ గురించి ఆలోచించ సాగారు. మూడుపదులు దాటి నాల్గవ పదిలోకి అడుగుబెట్టినా సత్యవతమ్మ ఆయనను ఇంకా చంటిపిల్లాడిలానే చూసుకుంటుంది. ప్రతీపనిలో ఆయనకు ఎంతో ఆత్మీయతతో సలహాలిస్తుంది. ఆమెలేనిదే ఆయన కొక్క క్షణం గడవదు. అటువంటి అర్ధాంగికి ఇన్నాళ్లకు కులాసా చిక్కిందంటే వెళ్తాంటే ఇంత అవాంతరం సంభవించడం ఆయనకు మాటిమాటికీ చిరాకు తెప్పిస్తోంది.

రామశర్మగారు బాగా కలిగినవారు. డబ్బే జీవితంలో లోటు అనుకొనేవారికి ఆయన జీవితం వడ్డించిన విస్తరి. ఆయన తండ్రి విశ్వేశ్వరశర్మగారు స్వగ్రామం వల్లభాపురం. కాని చిన్నప్పటి నుంచీ ఆయన విశాఖపట్టణంలో వుంటోన్న మావయ్య దగ్గరే పెరిగారు. అక్కడే ప్రాక్టీసుపెట్టి లక్షలార్జించి ఆ మామయ్యకూతురునే పెళ్లాడి అక్కడే స్థిరపడి పోయాడు. ఆయన ఒక్కగానొక్క కుమారుడు రామశర్మ. పుత్రుడనగా పున్నామ నరకంనుండి తప్పించువాడు గనుక రామశర్మను చాలా గారాబంగా అంతకుమించిన క్రమశిక్షణతో పెంచారు తల్లిదండ్రులు. ఆయనా చక్కగా చదువుకున్నారు. పైచదువుగా, డబ్బు—పలుకుబడీ వున్నవాళ్లకు వుద్యోగాలుదొరకడం రైళ్ళు రోజూలేటురావడంలా అతి సహజం గనుక రామశర్మకూ వొపై అంతస్థు ఆఫీసరు వుద్యోగం వచ్చింది.

ఆ వుద్యోగం వచ్చిన మరుసటి సంవత్సరమే సత్యవతమ్మ ఆయింట్లో ఆయన సహధర్మచారిణిగా అడుగుబెట్టింది. వారిద్దరూ ఎంతో అన్యోన్యం—ఆనందంగా వుండేవారు.

కాని—పూర్తిగా—లోటు లేకుండా— సంపూర్ణంగా ఎవరినీ సృష్టించడం చాతకాని దేవుడు బహుశా వీళ్ల కివ్వాల్సిన సంతానాన్ని ఇంకెవరో దరిద్రుడికి ప్రసాదించి వుంటాడు గనుక సత్యవతమ్మగారి కడుపు పండలేదు. ఆ వెలితి ఆ దంపతుల నిద్దరినీ మహా బాధించింది. ఆ బాధ యింతై, యింతింతై సత్యవతమ్మను నగం క్రుంగదీసి బ్లడ్‌ప్రెషర్ లోకి దింపింది. డబ్బుకుమాత్రం లోటు లేదు గనుక మద్రాసులో దూరపుబంధువు లింట ఆమెను విడిచి ఒక స్పెషలిస్టుచేత చికిత్స చేయించుకునే ఏర్పాట్లు చేసి వచ్చారు.

పదిరోజులు గడిచాక ఆ క్రితంరోజే ఆయన భార్య దగ్గరనుండి ఒక ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవరందుకొన్నాడు. ఆమెకు స్వస్థత చిక్కిందనిన్నీ, ఇక తన్ను విడిచి ఒక్కక్షణం ఈ మద్రాసులో వుండననీ వ్రాసింది. రామశర్మకూ భార్య ఎడబాటు దుర్భరంగాతోచి వెంటనే ఆమెను తీసుకురావడానికి బయల్దేరాడు.

గంట మ్రోగింది. బయల్దేరడానికి సిద్ధంగా వున్నానని సూచిస్తూ ఇంజన్ గర్జించింది. అప్పుడు గుర్తొచ్చింది రామశర్మగారికి సిగరెట్లయి పోయాయని. ఆ బ్రాండ్ సిగరెట్లు మిగతాచోట్ల దొరక్కపోవచ్చు. అందుకే హడావుడిగా గుమ్మం దగ్గరకువచ్చి సిగరెట్లమ్మే కుర్రాడిని పిలిచి పదిరూపాయల నోటిచ్చి వొ స్టేట్ ఎక్స్‌ప్రెస్ ప్యాకెట్ తీసుకున్నారు. ఆ సిగరెట్లమ్మేవాడు చిల్లర కోసం పరుగెత్తాడు.

ఆ సమయంలో —

ఆ కొద్ది క్షణాల్లో— వాడు చిల్లర తెచ్చే లోపునే ఆశ్చర్యకరమైన, ఆకర్షనీయమైన ఒకటి రెండు సంఘటనలు రామశర్మకంట బడ్డాయి.

ఎవరో ఒకతను — మిలట్రీ మీసాలు, చారల పైజమా— గోడప్రక్కనే నిల్చుని అన్నం పొట్లాం విప్పి ఆవురావురుమని బొక్కుతున్నాడు. అన్నానికి ముఖం వాచి

పట్నుండి ఆకలిబాలకం చూస్తున్నారా?

కొంచెం దూరంలో—శాఖాహార, పలహారశాల ముందు ఒక బిచ్చగత్తె పారేసిన ఎంగిలాకులు ఆత్రంగా ముందుకు లాక్కుని గబగబా ఏరుకుతింటోంది.

ఇంకొక అసామీ ఆ పొట్లమ్మే బండి దగ్గరే నిలబడి 'వైదుపాదం' (పెరుగన్నం) మహా స్పీడుగా జుర్రుకుంటున్నాడు. ఆ కంగారు చూస్తూంటే అతని వెనక ఎవరో తరుముతున్నట్లు— ఆ అన్నాన్ని ఎవరైనా లాక్కుంటారేమోనని భయపడుతున్నవాడికిమల్లే కన్పించాడు.

నవ్వొచ్చింది రామశర్మగారికి. రాత్రి మిగిలిపోయిన అన్నాన్ని పారవేయకుండా సాంబారు కలిపి పెరుగు కలిపి పొట్లాలు కట్టి అమ్ముతారట! రంగూ, రుచీ రెండూ వుండవు వాసన తప్ప' దాన్ని ఇంత ఆప్యాయంగా, ఇంత ఆతృతగా ఎలా తింటారో ఈ కొందరు??

రామశర్మగారికి ఈ ఆకలి అభాగ్యుల్ని చూస్తే అసహ్యం వేసింది. కాస్త నెమ్మదిగా తినలేరూ!

ఈ 'ఆకలి' సంగతి తెలియదుగాని ఇంకా మిగతా రకాల ఆకలి రామశర్మగారికి తెలుసు.

ఉడసిల్లను చూస్తే మగాడి కళ్లల్లో

ఆకలి

ఆకలి!! అసహాయుడిని — మధ్యతరగతిని చూస్తే వడ్డీవ్యాపారికి ఆకలి!! పెరిగిపోతున్నవాడి పర్సు చూస్తే పెరగలేని వాడికి ఆకలి!! అయికమత్యంగా వుంటే ఓర్వలేని కొందరికి ఆందోళన రేపాలనే ఆకలి!!

ఈ ఆకలి కాదు రామశర్మగారు చూసింది. అసలైన ఆకలి! ఈ 'ఆకలి' కడుపు ఆకలి. దీన్ని తీర్చుకోటానికి అడుక్కోవడానికి సైతం కొందరు పెద్ద మనుష్యులు దిగజారిపోతారెందుకు? అన్పించిందాయనకు.

'దరిద్రులకు ఆకలెక్కువట' దేశమంతా ఈ దరిద్రమూ, ఆకలీ ఆక్రమించుకోబట్టే నా దేశమూ ఇంకా అండర్ డెవలపింగ్ బోర్డు తగిలించుకుని మిగతా దేశాల్ని యాచిస్తోంది?

రైలు కదిలింది. సిగరెట్లమ్మేవాడు యిచ్చిన చిల్లరను యాంత్రికంగా జేబులో వేసుకుని తిరిగి సీటులో కూర్చున్నారు రామశర్మ. సూట్‌కేస్‌లో నుండి రెండు ఆపిల్స్ తీసుకు తిని—రెండు బిస్కెట్లు చప్పరించి— ఫ్లాస్కులో వున్న బోర్న్‌వీటా తాగారు. ఇవి ఆయనకు ఆకలివేసి తినలేదు. లంచ్‌టైము అయింది గనుక—రొటీన్‌గా—తిన్నారు.

అవును! రామశర్మలాంటి లక్ష్మీపుత్రులకు ఆకలి వెయ్యదు ధనవంతులకు దేవుడిచ్చిన శాపమో, వరమో తెలియదు గాని వరిగా ఆకలి వెయ్యదు. బహుశా వారి డబ్బు వాళ్లకు సృష్టించిన అనేక ఆలోచనలు వారి ప్రేగుల్ని బలహీనం చేసి వారిలో ఆకలిని శక్తిహీనం చేస్తుందో లేక — వాళ్ల ధన దర్పం సోమరితనాన్ని పెంచి — ఆ పెరిగిన సోమరితనం ఆకలి మాంద్యాన్ని కల్గిస్తుందో చెప్పడం కష్టం.

అందుకే రామశర్మగారు ఒక్కోసారి పై ఆఫీసర్లు కలిసినపుడు 'గోల్డ్ వాక్'లాటి ఫారిన్ సీసాని సగం ఖాళీచేసి రెండు చిప్సు నోట్లో వేసుకుని ఆ రోజుకి అదే భోజనం అని సరిపెట్టుకోగలరు. రెండున్నర రూపాయలు పెట్టి ఎయిర్‌కండిషన్డ్ మీల్స్ హోటల్ రూంలో కెళ్లి రెండు చెమ్చాలు తిని స్టైయిల్‌గా బయటకు వచ్చేసి భోజనం అయిపోయినట్లు భావించుకోగలరు. అలాటి ఆయనకు ఆకలి తీర్చుకోవటం కోసం ఒక మనిషి అవురావురు మని తింటూ వుంటే అసహ్యం వెయ్యడంలో విడ్డూరమేముంది?

* * *

ఆలోచనల్లోనే కునుకు పట్టింది రామశర్మగారికి. మళ్లీ మెలకువ వచ్చేటప్పటికే బండి ఒంగోలు దాటి చాలా సేపయింది. ఇంతలో వో చిన్న స్టేషన్లో బండి ఆగిపోయింది. ఈ అతిచిన్న స్టేషన్లో మెయిల్ ఆగటమేమిటి? అని సందిగ్ధంలో పడిన కొందరు ప్రయాణీకులు వర్షంలోనే బయటకు రాసాగారు. 'ఆ! ఏదో క్రాసింగ్ వుండి వుంటుందిలే అని కొందరు తమ సీట్లో నుండి కదలకుండానే సరిపెట్టుకున్నారు.

రామశర్మగారు కూడా బండి ఆగిన కారణం కనుక్కొందామని బయటకు వచ్చారు. అక్కడ ఎవరో అనుకుంటున్న మాటలు విని ఆయన గుండెలు గుభేలుమన్నాయి. వెంటనే అటెండరును పిల్చి అడిగారు.

'క్షమించండి సార్! ఇక బండి

కూరలూ గుణాలూ:

పొట్లకాయ

ఇది మిక్కిలి పథ్యమయిన కూర. శరీరానికి సమశీతోష్ణాన్ని కలుగజేస్తుంది. సులభంగా జీర్ణమవుతుంది. బాగా ఆకల్ని పుట్టిస్తుంది. త్రిదోషాల్ని (వాత పిత్త శ్లేష్మాలు) హరిస్తుంది. కఫపైత్యాన్ని, క్రిమి రోగాన్ని, ఆమవాతాన్ని పోగొట్టడానికి తోడ్పడుతుంది. పైత్య వాతాలను అణచివేస్తుంది. వీర్యపుష్టి నిస్తుంది. శరీరంలోని వేడిని తాపాన్ని పోగొట్టి చలవ చేస్తుంది.

శ్లేష్మవాతాలు గలవారు అధికంగా తింటే హాని చేస్తుంది. దీని దుర్గుణాలకు విరుగుళ్లు : 1. గరమసాల, 2. అవగుండ, 3. ఆగాకరకాయలు, 4. దోసకాయలు.

సేకరణ :—ఆకుండి నారాయణమూర్తి.

ముందుకు వెళ్ళదు. వాతావరణం అతి భయంకరంగా వుంది. రైలు పంతాలు రెండు కూలిపోయాయి. రైలు కట్టకు అనేక చోట్ల గండ్లు పడ్డాయి. ఉప్పుగుండూరు — సింగరాయకొండల మధ్య ఏరు పొంగి రైల్వే లైను తుడిచిపెట్టుకుపోయింది. ఈ స్థితిలో బండి ఒక్క అడుగైనా ముందుకు కదలడం అతి ప్రమాదకరం. అసలు డ్రైవరుకు ట్రాక్ కన్పించడం లేదు' అన్నాడు.

రామశర్మగారికి గుండె జల్లుమంది. అంతవర్షంలోనూ ఆయనకు చిరుచెమట్లు పట్టాయి. అక్కడ నిల్చోలేక తన సీట్లోకి వెళ్ళి కూలబడ్డారు.

తమ రైలును డిటెయిన్ చేశారన్న వార్త ప్రయాణికుల్లో కార్చిచ్చులా వ్యాపించింది. అంత వర్షంలోనూ ప్రయాణికులు గుంపులు గుంపులుగా చేరి తమకు కలిగిన దురదృష్టం గురించి ఎవరికి తోచిన విధంగా వారు చర్చించుకోసాగారు. అందరి మొహాల్లోనూ ఆందోళన ప్రస్ఫుట మవుతోంది. దిక్కు తోచడం లేదెవరికీ! కొందరాడవాళ్ళు ఏడుపు మొదలుబెట్టారు. ఎందుకు బయల్దేరాము రా భగవంతుడా! అని కొందరు తమకు తామే తిట్టుకుంటున్నారు ఇంటిదగ్గర తమ భార్యాబిడ్డలు ఏమవుతారో అని భర్తలు, తండ్రులు బెంగపడితే — తనతో ప్రయాణం చెయ్యకుండా ఇంటి దగ్గరవుండిపోయిన పిల్లల్ని తలుచుకొని కొందరు తల్లులు కుమిలిపోతున్నారు.

రాకరాక వచ్చిన ఒకే యింటర్వ్యూ అందుకోలేకపోతున్నానని ఒక నిరుద్యోగి ఏడుస్తే — ఎల్లుండి బెంగుళూరులో గుర్రాలు పరుగెత్తేటప్పుడు వుండలేనేమో అని ఇంకొక జూదరి వాపోతున్నాడు.

ఇలా రకరకాల వ్యధిత హృదయాలతో స్టేషనంతా భీభత్సంగా — కోలాహలంగా — భయానకంగా వుంది.

రామశర్మకు దిక్కు తోచడంలేదు. ఈ తుఫాను ఆగే సూచన కనబడటం లేదాయనకి. ఈ ప్రకృతి ప్రళయం ఏనాటికి ముగుస్తుందో తెలియదు. తిరిగి భార్యను చూసేటప్పటికి ఎన్నాళ్ళు పడుతుందో అని మథనపడుతున్నారు.

* * *

మెయిల్ డిటెయిన్ అయింది అతి చిన్న పల్లెటూరు స్టేషన్లో. అక్కడ వుండాల్సినవో అతిచిన్న హోటలు మూసేశారో, కొట్టుకుపోయిందో తెలియదు ఈ వర్షం దెబ్బకు అందుకని మిగతా చాలామంది ప్రయాణికులు ఏసుస్తున్నా తన దగ్గర మిగిలిన పళ్ళూ బిస్కట్లూ తినేశారు రామశర్మ.

ఆరోజంతా వర్షం తగ్గలేదు సరికదా ఎక్కువైంది. రామశర్మ పడుకొందామని తన కంపార్ట్‌మెంట్' చేరారుగాని అపసవ్యమైన ఆలోచనలతో — వచ్చీపోయే ఆందోళిత మనస్కులైన ప్రయాణికులతో ఆయనకు నిద్రపట్టలేదు.

ఆ మరుసటిరోజు వుదయం పదిగంటలైంది.

ఆరోజు —...సరిగ్గా —

పన్నెండు గంటలకు —

రామశర్మగారికి ఒక నూతన విషయం అవగతమైంది.

ఆయన కడుపులో ఏదో మండుతున్నట్లు —...

ఎలుకలు ఇటూ అటూ పరిగెత్తినట్లు —...

ఆయనకేదో నిస్సత్తువ కల్గినట్లు —

—...అన్పించినపుడు —...

హఠాత్తుగా నలభై రెండేళ్ళకి జ్ఞానోదయమైనట్లు పలవరించారు — ఒకే మాట —...

—ఆ...క...లి!...!

రామశర్మకు భరించరాని ఆకలి వేస్తోంది. ఎవరో మూడవ తరగతి ప్రయాణికురాలు ఆ వర్షంలోనే పుల్లలేరుకువచ్చి ప్లాట్‌ఫాం ప్రక్కగా మూడు రాళ్ళు వేసి మంటచేసి ఒక దోసెడు బియ్యం వుడికించి తన పిల్లలిద్దరికీ పెడుతోంది. వాళ్ళు ఆవురావురుమంటూ తింటున్నారు. రామశర్మగారి కెందుకో వాళ్ళనలా చూస్తుంటే అసహ్యం వెయ్యలేదు — సరిగదా — తనువెల్లా పులకరించిపోయింది.

ఆయన ఆకలి అధికమైంది. తటాలున వారి ముందుకువాలి ఆ మల్లెపువ్వులా — వేడి పొగలు చిమ్ముతూన్న అన్నం లాక్కుని గబగబా తినెయ్యాలన్పించింది. కాని ఆ తలపు రాగానే ఆయనెందుకో తనలోతానే సిగ్గుపడిపోయాడు. వెంటనే తన కంపార్ట్‌మెంటులోకి వెళ్ళి తన పాకెట్‌లో తినగా మిగిలిపోయిన బిస్కెట్లు తిన్నారు. కాని అవి ఎందుకో ఆయనకు తృప్తికరంగా లేవు. అవి ఆయన ఆకలి తీర్చలేకపోయాయి. పళ్ళు, బిస్కెట్లు, జామ్‌లు ఇలాటి నవనాగరికపు తిండ్లు ఎన్నైనా కాస్తంత చక్కటి భోజనానికి



పొటిరోసవని ఆయన ఆ కొద్దిసేపటి అనుభవంలోనే తెలుసుకున్నారు.

ఆకలి అధికమైనకాలం గంటల్ని మింగేస్తూ త్వరగా పరుగెడుతోంది. సమయం గడిచేకొద్దీ రామశర్మగారి ఆకలి రాక్షసిలా విజృంభిస్తోంది. మనిషి తోటకూర కాడలా వాలిపోతున్నాడు. కాని చిత్రమేమిటంటే — ఆయనకు ఆకలిబాధ ఎంత అధికంగా వున్నా ఎన్నడూ తనెరుగని ఈ అనుభవం ఛాయలు ఆ బాధలో కొంచెం మాధుర్యాన్ని చిలికించలేక పోలేదు. అలా చిలికించినప్పుడల్లా ఆయన ఎంతకాలం ఆకలి మాధుర్యాన్ని యెరుగక వృధా అయిపోయిందోనని చింతిస్తున్నారు. అంతేగాక ఆయనకు చిన్నతనంలో తల్లిచేసే కొబ్బరి పచ్చడి, ఆవకూరా, గుత్తివంకాయకూరా— కాకరకాయ వేపుడూ — గోంగూరపచ్చడి గుర్తుకు రాసాగాయి. అలా అవి గుర్తొచ్చినపుడు మరీ ఆకలి అధికమౌతున్నది.

ఆ సాయంత్రం —

రెండుగంటలకు రైల్వేవాళ్ళు ప్రయాణీకులకు భోజనం సమకూర్చారు. సమకూర్చారు అనడంకంటె పంచారు అంటే బాగుంటుంది. నాలుగుబుట్టల్లో సాంబారు కలిపిన అన్నంపాకెట్లు వచ్చాయి. అందరూ ఎగబడ్డారు వాటిమీదికి. స్టేషను మాస్టరు అందర్నీ క్యూలో నిల్చోమని ప్యాకెట్లు పంచుతున్నారు. రామశర్మకు అలా అన్నం ప్యాకెట్టుకోసం క్యూలో నిల్చోవడమంటే సిగ్గేసింది. ఆత్మాభిమానం అడ్డొచ్చింది.

అందుకే ఆయన తన సీట్లోనే కూర్చున్నారు. స్టేషన్ మాష్టారు తన వంతు ప్యాకెట్ తీసుకొచ్చి తన కిస్తాడనే విభ్రమను సృష్టించుకొని చాలాసేపు నిరీక్షించారు. కాని స్టేషను మాష్టరు ఆ ప్యాకెట్ల పంపకం గొడవలో పూర్తిగా మునిగిపోయాడు. తన భ్రమ చివరకు తనను ఆ ఒక్క ప్యాకెట్టుకూ దూరం చేస్తుందని తెలిసి ఆయన ఆత్మాభిమానాన్ని చంపుకొని క్యూలో చివరకు వెళ్ళి నిలుచున్నారు ప్యాకెట్టుకోసం నిరీక్షిస్తూ.

ఆ క్యూలో బీదలున్నారు. ధనికులున్నారు. పూటకు గతిలేనివాళ్ళున్నారు. కోటికి పడగలెత్తినవాళ్ళున్నారు. పట్టెడన్నం లేనివాళ్ళున్నారు — హోటల్ ప్రొప్రయిటర్లు—రైస్‌మిల్లు ఓనర్లూ వున్నారు.

దైవలీల! ప్రకృతి కన్నుతెరిస్తే — ఆకలి ఆకారం ధరిస్తే మానవుల్లో తారతమ్యాలు నశిస్తాయి. బీదాగొప్ప భేదాలు ఒకే క్యూలో అంతరించి పోతాయి.

తనందుకున్న ప్యాకెట్టును తన సీటు దాకా తీసికెళ్ళే సహనంపోయింది రామశర్మకు. ఒక్కచోటే విప్పి ఆవురావురుమంటూ తినసాగేరు. ఆ క్షణంలో ఆయనకు విజయవాడ ప్లాట్‌ఫారంమీద మిలట్రీ మీసాలూ, బిర్రగెత్తిన తళుక్కుమన్నారు ఆ జ్ఞాపకాలు ఆయనను విచిత్రంగా చలింపజేశాయి ఏదో కొత్త సత్యం గోచరించినట్లయింది.

ఆయన ఆకలి తీరలేదు. వెళ్తున్న స్టేషన్ మాష్టర్ని పిల్చారు.

'ఏం కావాలండీ' అన్నాడు స్టేషన్ మాస్టరు వినయంగా. రామశర్మగారి ధనికవేషం అతనిలో ఆ గౌరవం కల్గించింది.

'అబ్బే! ఏం లేదండీ ... అహ ... కాదు...' ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియక తికమక పడుతున్నా రాయన.

స్టేషను మాష్టరుకు నవ్వొచ్చింది.

'చెప్పండి...ఫర్వాలేదు...మళ్ళీ నాకు పనుం దవతల' అన్నాడు.

రామశర్మ తనకు తెలిసిన విధానంలో చెప్పదల్చుకున్నారు. వెంటనే కోటు జేబులో చెయిపెట్టి బయటకు తీశారు. స్టేషన్‌మాస్టరు కళ్ళు జిగేల్‌మన్నాయి.

'చూడండి మాష్టారూ! ఇవన్నీ మడత నలగని వందరూపాయల నోట్లు. ఇలాటివి నా దగ్గర చాలా వున్నాయి. వీటికి ప్రపంచంలో ఎంత విలువవుందో మీకు తెలుసు. వీటికి అన్నివేళలా విలువ వుంటుందని నేననుకొనేవాణ్ణి. కాని ఇవికూడా కొన్ని సమయాల్లో వ్రత్త నిరుపయోగమని, గడ్డిపోచకన్నా విలువ చెయ్యవని నేను ఇప్పుడే గ్రహించాను.'

ఆయనచెప్పే వుపోద్ఘాతం దేనికో ఆ ముసలి స్టేషన్‌మాష్టరు కంతు బట్టలేదు.

'చూడండి మాష్టారూ!' క్షణమాగి అన్నారు రామశర్మ 'ఈనాడు యింతడబ్బు వుండికూడా నాకున్నలిగిన ఆకలిని తీర్చుకోలేక పోతున్నాను—క్షమించండి ... దయచేసి ఎంతడబ్బు కావాలో తీసుకుని ఆ భోజనం ప్యాకెట్టు ఒకటి యివ్వగలరా ?' ఆఖరివాక్యం పలుకుతున్నప్పుడు ఆయన కంఠం జీరవోయింది.

స్టేషన్ మాష్టరుకు అర్ధమైంది.

'చూడండి... మీరు సున్నిత హృదయులు ... మీలాటివాళ్ళు ఒక్క సంఘటనకే చలించిపోతారు. ఐతే—ఒక్కటి మాత్రం నిజం—మీ రన్నట్లు డబ్బు దేముడుకాడు డబ్బుతో అన్ని వేళల్లో అన్ని కొనుక్కోలేము. ఆలోచించండి...మీరు కనీసం కన్నెత్తయినా చూడని భోజనంకోసం మీరెంత డబ్బయినా దారపోయడానికి సిద్ధంగా వున్నారు. కనుక— ఆకలికన్నా— ఆ ఆకలి తీర్చే ఆహారంకన్నా మీ డబ్బు విలువైంది కాదు ఈ క్షణంలో.'

రామశర్మ తలవూపి చిర్నవ్వుతో డబ్బుచేతిని ఆయన ముందుకు జూపారు. కాని స్టేషన్‌మాష్టరు చేతోనే వారించాడు.

'సారీ సర్! తుఫానులో చిక్కుకుని అలమటిస్తోన్న ప్రయాణికులకు రైల్వేవాళ్ళు ఏర్పాటుచేసిన భోజనం యిది. మేము వుచితంగానే యివ్వాలి. తుఫాను యివాళ వుంటుంది, రేపు పోవచ్చు కాని అయాచితంగా లభించే లంచానికి ఆశపడి నే నింకొకరి నోటివద్ద కూడు పడగొట్టి మీ కడుపు నింపలేను. అది నాచేతకాదు —ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీసారీ!'

స్టేషన్ మాష్టరు వెళ్ళిపోయాడు.

కొత్త మనుష్యులు ఇంకా కొద్దిమంది లోకంలో వున్నారని రామశర్మకు ఆరోజే తెలిసింది. ముగ్ధుడై — వివశుడై — విచిత్రంగా చూశాడు ధనానికి లొంగని ముసలి స్టేషన్ మాష్టరు వైపు.

* * *

మరి మూడురోజులకుగాని తుఫాను తగ్గలేదు. ఆ మూడురోజులూ రామశర్మకు రైల్వేవాళ్ళు ఏర్పాటుచేసిన భోజనం తినక తప్పలేదు.

వర్షంతగ్గి రూట్ బాగుపడ్డాక తిరిగి

బండ్లు బయల్దేరాయి. జీవితంలో మరువ లేని ఒక చక్కటి అనుభవాన్ని సేకరించుకుని రామశర్మగారు మద్రాసు చేరారు. సత్యవతమ్మగారికి భగవదను గ్రహంవల్ల కులాసా చిక్కింది. తిరిగి ఆమెతో రామశర్మగారు విశాఖపట్నం బయల్దేరారు.

* * *

రైలు విశాఖ చేరినతర్వాత రామశర్మగారు భార్యను వెంటబెట్టుకుని జనాన్ని తప్పించుకుంటూ ముందుకు వెళ్తున్నారు

'కాఫీ...టీ' 'పత్రిక...వీక్లీ'

'కూలీ...కూలీ...' 'బాబూ...పైసా'

'గుడ్డోడిని! ధర్మం చెయ్యండి బాబూ!'

ఇలాటి అరుపుల్ని అతి నిర్లక్ష్యంగా వింటూ పోతున్న రామశర్మగారు చటుక్కున ఆగారు. రామశర్మగారి ముందు ఒక కుర్రాడు నిల్చున్నాడు. బాగా నీరసంగా వున్నాడు—పొట్టంతా రేగి పోయివుంది.

'సార్! ఏదన్నా వుంటే సాయం చెయ్యండి...ప్లీజ్—' అని కంఠం దీనంగా పలికింది.

రామశర్మగారు 'వెళ్ళు...వెళ్ళు...' అని చీదరించుకుని ముందుకువెళ్ళారు. వెనక నుండి అదే కంఠం వినబడుతోంది.

'మూడురోజులనుండీ అన్నం లేదు ... ఆకలిసార్ ఆకలి—ఈ ఆకలి భరించలేక పోతున్నాను'

సడన్ బ్రేకు వేసినట్లు ఆగిపోయారు రామశర్మ. చటుక్కున వెనక్కు తిరిగి ఆ యువకునివైపు పరుగెత్తారు. అతని ఎదుట నిలబడి పరీక్షగా చూశారు.

'సార్! బియ్యే ప్యాసయ్యాను. మాది నెల్లూరు. అతి కష్టంమీద ఓ వుద్యోగం ఇంటర్వ్యూ వస్తే వచ్చాను. వుద్యోగం రాలేదు. వెళ్ళడానికి డబ్బులేదు—మూడు రోజులనుండి అన్నంలేదు—ఆకలి—'

'వీళ్ళదంతా అబద్ధం ... మోసం... అడుక్కోవడంలో ఇదొక కొత్తఫ్యాషన్...' అని ఇంకా ఏదో చెప్పబోతోన్న సత్యవతిని చేత్తోనే వారించారు రామశర్మ. ఆయన మనసులో 'ఆకలి' అని ఆ కుర్రాడన్నమాట సుళ్ళు తిరుగుతోంది. జేబులో నుండి అయిదురూపాయల నోటు తీశారు.

'చూడబ్బాయ్! నువ్వు అబద్ధం చెబుతున్నావో నిజం చెబుతున్నావో నాకు తెలియదు. ఒక్కటి మాత్రం నిజం ఏమిటంటే... నువ్వు ఆకలితో వున్నావు... నీ వాలకమే చెబుతోంది నీ కడుపులో రగిలే ఆకలిగురించి...వెళ్ళు... ఈ డబ్బుతీసి వెళ్ళి తృప్తిగా భోంచెయ్'

ఆశ్చర్యంతో స్థంభించి పోయిన భార్యనీ ఆకుర్రాడినీ చూడకుండా వెనక్కు తిరిగారు రామశర్మ. ఆయన ముఖంలో బాధ, తృప్తి కలసిన ఒక చిత్రమైన హాసం తళుక్కుమంది. అయోమయంగా చూస్తోన్న భార్య వైపు తిరిగారు.

'సత్యవతీ... అన్నీ అబద్ధంగావచ్చు కాని ఆకలి అబద్ధంగాదు, మనకూ — మన దేశానికి పట్టిన సమస్య ఆకలి—ఆహారం చాలక—ఆహారం సరిపోక—ఆకలి—ఆకలి చావుల్తో దేశం అలమటిస్తోంది.'

తెలియని ఆవేశం కట్టలు త్రెంచుకుని నిర్ఝరఝరిలా ఆయన గుండెల్లో నుంచి పుబుకుతోంది. ఆయన కంఠం గంభీర మౌతోంది.

'సత్యా! ఈ పరిస్థితి మారాలి, ప్రతి ఒకడూ ప్రతిపౌరుడూ నడుంకట్టి 'ఆకలి' నరకాసురుణ్ణి జయించి ప్రతిపేద హృదయంలోనూ సంతృప్తి దీపాలు వెలిగించాలి. ఆ దీపావళి జనావళి హృదిలో కోటికాంతులు నింపి దేశాన్ని పునీతం చెయ్యాలి, స్వామీ వివేకనంద చెప్పినట్లు 'నాదేశంలో ప్రతీ ఒకడి ఆకలి తీరేవరకూ నేను ఎన్నిసార్లైనా జన్మ ఎత్తుతూనే వుంటాను' అని ప్రతిఒకడూ ప్రతిన చేయాలి...'

హఠాత్తుగా రామశర్మ భార్య ముఖం లోకిచూసి అన్నారు...'సత్యా! ఆ భయంకర మైన ఆకలిబాధ నేనూ ఎరుగుదును ... నిజం... ఆకలిబాధ నాకూ తెలుసు—'

సత్యవతమ్మగారికి ఆయన మాట్లాడు తున్నదేమిటో బొత్తిగా తెలియలేదు.

కాని తనభర్త చెమ్మగిల్లిన కళ్లను రుమాలుతో తుడుచుకోవడం స్పష్టంగా చూసి ఎందుకో అర్థంగాక నిశ్చేష్టిత అయింది. ●